JAYABHERIDAILY.COM

ప్రభాత
# జయభేరి

తెలుగు దినపత్రిక

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 22-12-2025 సంపుటి : 02 । సంచిక : 206 । పేజీలు : 8 । వెల : 5

Medchal - Malkajgiri । Monday 22-12-2025 jayabherinews Vol. 02 । Issue 206 । Pages : 8 । ₹ : 5



విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me



jayabheripaper@gmail.com




# ఎమ్మెల్యేలకు రేవంత్ క్లాస్..

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 20 :

తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో అత్యంత కీలకమైన పల్లె పోరు ముగిసింది. మూడు విడతలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్నే అందించాయి. రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుడి తీర్పు హస్తంవైపు మొగ్గు చూపినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ భారీ విజయం వెనుక ఉన్న ఉత్సాహాన్ని పక్కనపెట్టి పార్టీలోని అంతర్గత లోపాలను సరిదిద్దే పనిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమగ్నమయ్యారు. గెలిచామన్న గర్వం కంటే, పార్టీ క్రమశిక్షణే ముఖ్యం అన్నట్టుగా అధిష్ఠానం వ్యవహరించిన తీరు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురు వేసింది. మూడు విడతల ఎన్నికల సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంటూ సుమారు 56 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. తుది లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12, 733 పంచాయతీ సర్పంచి పదవులకు గానీ దాదాపు ఏడు వేలకుపైగా కాంగ్రెస్ మద్ధతు దారులు గెలుచుకున్నారు. రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో ఎన్నికల కోలాహలం నెలకొనగా, కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని చాటుకుంది. ఒక్క సిద్ధిపేట జిల్లా మినహా, మిగిలిన 30జిల్లాల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచింది. ముఖ్యంగా నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి కీలక జిల్లాల్లో కాంగ్రెస్ క్వీన్ స్వీప్ చేసింది. అయితే ఇంత ఘన విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం పార్టీ వైఫల్యాలపై లోతైన విశ్లేషణ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,

...మిగతాది 2 లో



# రాష్ట్రపతి నిలయంలో గ్రాండ్‌గా 'ఎట్ హోమ్'

## గవర్నర్, సీఎం సహా మంత్రుల హాజరు

**హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం సందడిగా సాగుతోంది. ఎట్ హోమ్ కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. తేనీటి విందుతో పాటు పసందైన తెలంగాణ వంటకాలకు అతిథులు ఫిదా అయ్యారు. చక్కని ఆతిథ్యం ఇచ్చారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు.**

జయభేరి, హైదరాబాద్ :

సికింద్రాబాద్ పరిధి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం ఘనంగా సాగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన తేనీటి విందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్ రావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. ఆనవాయితీ ప్రకారం రాష్ట్రపతి వేసవిలో సిమ్లాలో విడిది చేస్తారు. అలాగే శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌లో పర్యటిస్తారు.

ఈ క్రమంలోనే ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము డిసెంబర్ 17వ తేదీన భాగ్యనగరానికి వచ్చారు. సికింద్రాబాద్ పరిధి బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో బస చేశారు. హైదరాబాద్ వేదికగా పలు అధికారిక కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. బొల్లారంలో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,పలువురు ప్రముఖులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆత్మీయంగా మాట్లాడారు.

ఈ సందర్భంగా తేనేటి విందుతో పాటు పసందైన తెలంగాణ వంటకాలు హైలైట్‌గా నిలిచాయి. చక్కని ఆతిథ్యం ఇచ్చారని అధికారులు, సిబ్బందిని రాష్ట్రపతి అభినందించారు. ఇక పలు రంగాలకు చెందిన ప్రముఖులను కూడా ఎట్ హోం కార్యక్రమానికి రాష్ట్రపతి ఆహ్వానించారు. ఆహ్లాదకర వాతావరణంలో అతిథులంతా ఆత్మీయంగా గడిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అతిథులు ధన్యవాదాలు, అభినందలు తెలిపారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు

- సిట్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనార్ సీరియస్ డైరెక్షన్స్

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ స్పీడందుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో పూర్తి ఛార్జ్‌షీట్‌కు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న అందర్నీ ప్రశ్నించాలని సిట్‌కు డైరెక్షన్స్ ఇచ్చారు. దీంతో పోలీసుల ప్రత్యేక అధికారుల బృందం రంగంలో దిగింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్.. వైడ్ యాంగిల్ ఎంక్వయిరీ చేపట్టింది. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 9మంది సిట్ అధికారులతో సమావేశమయ్యారు సీపీ సజ్జనార్ .ఫోన్ ట్యాపింగ్ కేసులో పూర్తి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. కేసుతో సంబంధం వున్న అందర్నీ

...మిగతాది 2 లో

# వారి కోసమే కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తోంది

జయభేరి, న్యూఢిల్లీ:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల అస్సాం పర్యటన సందర్భంగా డిసెంబర్ 21న నమ్రప్ చేరుకున్నారు. అస్సాం వ్యాలీ ఫర్టిలైజర్ అండ్ కెమికల్ కంపెనీ లిమిటెడ్ అమ్మోనియాయూరియా ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేశారు. వేడుక తర్వాత, ప్రధాని మోదీ మాట్లాడుతూ, "అస్సాం తోపాటు మొత్తం ఈశాన్య ప్రాంతాలకు శుభదినం. నమ్రప్, దిబ్రుగఢ్ చాలా కాలంగా ఎదురుచూస్తున్న కల నిజమవుతోంది" అని అన్నారు. ఈ ప్రాంతంలో పారిశ్రామిక పురోగతిలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని మోదీ అన్నారు. దిబ్రూఘర్‌కు రాకముందు, ఆయన గౌహతిలో వెదురు ఉపయోగించి నిర్మించిన కొత్త విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించారు. అస్సాం అభివృద్ధిలో కొత్త వేగాన్ని చేరుకుందని, మీరు ఇప్పుడు అనుభవిస్తున్నది ప్రారంభం మాత్రమే అని ప్రధాని మోదీ తెలిపారు. "ఈ ఆధునిక ఎరువుల కర్మాగారాన్ని ప్రారంభించడం రైతు సోదరులందరికీ ఎంతో ఉపయోగం. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో పరిశ్రమలు, కనెక్టివిటీ ఈ సహకారం అస్సాం కలలను నెరవేరుస్తోంది. యువత కొత్త కలలు కనేలా



ప్రేరేపిస్తోంది" అని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో దేశ రైతులు, ఆహార ప్రదాతలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. అందువల్ల, రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి

...మిగతాది 2 లో

# ఐదు ఏళ్లలో లక్ష 80 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి

**కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ భారతదేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ఒక పెద్ద జాతీయ సమస్యగా అభివర్ణించారు. పార్లమెంటులో తన ప్రసంగంలో, గణాంకాల ప్రకారం, భారతదేశంలో సంవత్సరానికి సుమారు 4.8 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, వీటిలో దాదాపు 1.8 లక్షల మందికిపైగా మరణిస్తున్నారని ఆయన తెలిపారు.**



2 లో

జయభేరి, ముంబై, డిసెంబర్ 21:

రోడ్డు ప్రమాదాల విషయంలో అత్యంత దారుణమైన రికార్డు మన దేశానిదేనని ఆయన అంగీకరించారు.గడ్కరీ మాట్లాడుతూ, తాను ఏదైనా అంతర్జాతీయ సమావేశానికి హాజరైనప్పుడు, అక్కడ రోడ్డు ప్రమాదాలు లేదా సంఘటనలకు సంబంధించిన ప్రశ్నలు అడిగినప్పుడు, తాను ముఖం దాచుకోవడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. అయితే, భారతదేశంలో ఎన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో, వాటి కారణంగా కేంద్ర రోడ్డు మంత్రి తన ముఖం దాచుకోవాల్సి వస్తుందో మీకు సందేహం రావచ్చు. దాని గురించి తెలుసుకుందాం.భారతదేశంలో గత 5 సంవత్సరాల గణాంకాలు 2018 నుంచి 2022 మధ్య రోడ్డు ప్రమాదాల్లో 7.77 లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది చాలా దారుణమైన రికార్డు అని తెలియజేస్తున్నాయి. ఈ ప్రమాదాలు తగ్గడం లేదు. 2024లో ఈ సంఖ్య సుమారు 1.80 లక్షలకు చేరుకుంది. అంటే, ప్రతిరోజూ సుమారు 485 మంది రోడ్డు ప్రమాదాలలో తమ ప్రాణాలను కోల్పోతున్నారు. 2014లో మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, కానీ తాను దానిని సాధించలేకపోయానని, రోడ్డు ప్రమాదాలు తగ్గడానికి బదులుగా పెరిగాయని గడ్కరీ బహిరంగంగా అంగీకరించారు.కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ రోడ్డు ప్రమాదాలను దేశానికి ఒక పెద్ద సమస్యగా అభివర్ణించారు. ఆయన ప్రకారం, రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువ సంఖ్య యువతదే. మరణించిన వారిలో దాదాపు 60 శాతం మంది 18 నుంచి 34 సంవత్సరాల మధ్య వయస్సు వారేనని, అంటే చదువు, ఉద్యోగం కుటుంబ బాధ్యతల దశలో ఉన్నారని ఆయన చెప్పారు.కొన్ని ఇతర నివేదికల ప్రకారం, 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారిలో 66.4 శాతం మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారు. గడ్కరీ దీనిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఈ వయస్సు వారే దేశ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, భవిష్యత్తుకు వెన్నెముక అని అన్నారు.

# అమెరికాలో ఎన్ని రోజులు ఉండొచ్చు



- ఏది అసలైన గడువు?
- ట్రంప్ ప్రయాణ నిషేధం.. కొత్తగా 5 దేశాలు
- I-94 ఎవరికి అవసరం?

జయభేరి, న్యూఢిల్లీ:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత వలస నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నారు. తాజాగా అమెరికా సందర్శించే అంతర్జాతీయ ప్రయాణికులకు, ముఖ్యంగా భారతీయులకు యూఎస్ ఎంబసీ ఒక కీలక హెచ్చరిక జారీ చేసింది. మీరు అమెరికాలో ఎంతకాలం ఉండవచ్చనేది మీ వీసాపై ఉన్న గడువు తేదీ నిర్ణయించదని స్పష్టం చేసింది.

### ఏది అసలైన గడువు?

చాలా మంది తమ వీసాపై ఉన్న Expiry Date వరకు అమెరికాలో ఉండవచ్చని భావిస్తారు. కానీ యూఎస్ ఎంబసీ దీనిపై స్పష్టతనిస్తూ.. మీరు అమెరికా చేరుకున్నాక యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారి అనుమతించిన తేదీ వరకు మాత్రమే ఉండాలని తెలిపింది. ప్రయాణికులు తమ బస వ్యవధిని తెలుసుకోవడానికి I94 ఫారమ్ లోని Admit Until Dateని చెక్ చేయాలి. వీసా గడువు ఉన్నప్పటికీ, I94లో ఇచ్చిన తేదీ దాటితే అది చట్టవిరుద్ధం అవుతుంది. ప్రయాణికులు i94.cbp.dhs.gov వెబ్‌సైట్‌లో తమ అడ్మిషన్ నంబర్ లేదా ట్రావెల్ హిస్టరీని చెక్ చేసుకోవచ్చు.

### ట్రంప్ ప్రయాణ నిషేధం.. కొత్తగా 5 దేశాలు

మరోవైపు ట్రంప్ ప్రభుత్వం తన ట్రావెల్ బ్యాన్ పరిధిని విస్తరించింది.

...మిగతాది 2 లో

# డీఎం & హెచ్ ఓ గారు కాస్త ఉప్పల్ పీహెచ్ సీ పై దృష్టి సారించండి

...మిగతాది 3 లో

మొదటిపేజీ తరువాయి

## రోడ్డు ప్రమాదాల్లో మృతి

రోడ్డు ప్రమాదాల కారణంగా భారతదేశం ప్రతి సంవత్సరం తన GDPలో దాదాపు 3 శాతం నష్టాన్ని ఎదుర్కొంటుందని కూడా ఆయన తెలిపారు.దేశంలో రోడ్డు ప్రమాదాల గణాంకాల ప్రకారం, 2018 నుంచి 2022 మధ్య ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది, ఇక్కడ 1,08,882 మంది రోడ్డు ప్రమాదాలలో తమ ప్రాణాలను కోల్పోయారు. తమిళనాడు రెండో స్థానంలో ఉంది, ఇక్కడ 84,316 మంది మరణించారు. మహారాష్ట్ర మూడో స్థానంలో ఉంది, ఇక్కడ 66,370 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ గణాంకాలు నిజంగా ఆశ్చర్యకరమైనవి.
సంవత్సరం వారీగా ప్రమాదాలు, మరణాల సంఖ్య.. గణాంకాల ప్రకారం, 2018లో దేశంలో మొత్తం 4,70,403 రోడ్డు ప్రమాదాలు జరిగాయి, ఇవి అన్ని సంవత్సరాల్లో అత్యధికం. ఈ సంవత్సరంలో 1,57,593 మంది మరణించారు. 2019లో ప్రమాదాలు 4,56,959కి తగ్గాయి, కానీ మరణాల సంఖ్య 1,58,984కి పెరిగింది. 2020లో కరోనా లాక్‌డౌన్ కారణంగా రోడ్లపై వాహనాలు తక్కువగా నడిచాయి, కాబట్టి ప్రమాదాలు 3,72,181కి, మరణాలు 1,38,383కి తగ్గాయి, ఇవి ఈ సంవత్సరాలలో అత్యల్పం. 2021లో పరిస్థితులు సాధారణం కావడంతో, ప్రమాదాలు 4,12,432కి పెరిగాయి. మరణాల సంఖ్య 1,53,972కి చేరుకుంది. 2022లో ప్రమాదాలు 4,61,312గా నమోదయ్యాయి, కానీ అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ సంవత్సరంలో 1,68,491 మంది మరణించారు, ఇది అన్ని సంవత్సరాలలో అత్యధికం.

## ఎమ్మెల్యేలకు రేవంత్ క్లాస్..

కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షితో కూడిన బృందం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఫలితాలపై సమీక్ష నిర్వహించింది. ఈ క్రమంలో కొందరు ఎమ్మెల్యే తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 18 మంది ఎమ్మెల్యేల పని తీరుపై రేవంత్ రెడ్డి గుర్రుగా ఉన్నట్టు సమాచారం. పార్టీ గెలిచినా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక నేతల మొండివైఖరి వల్ల పార్టీకి నష్టం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారని తెలుస్తోంది. ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా నిలబడిన రెబల్‌స్‌ను బుజ్జగించడంతో, వారిని సమన్వయం చేయడంలో దాదాపు 16 మంది ఎమ్మెల్యేలు విఫలమయ్యారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దీని వల్ల ఓట్లు చీలి పార్టీకి తీరని నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. బంధు ప్రీతిపై ఆగ్రహం: కొందు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలు తమ సొంత బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని అధిష్ఠానం తీవ్రంగా తప్పుపట్టింది. అర్హులైన కార్యకర్తలను కాదని, బంధువులకు టికెట్ ఇవ్వడం పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన నేతలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా హెచ్చరిక జారీ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి రిపీట్ అయితే ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి , నియమ నిబంధనలు పాటిస్తూ పని చేయాలని తమ వైఖరి మార్చుకోవాలని ఆదేశించారు. అధికారంలో ఉన్నామన్న అశ్రద్ధ పనికిరాదని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగ్గా పని చేయలేదంటూ 16 మంది ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్ నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు.పలు ప్రాంతాల్లో రెబల్‌స్‌ను సమన్వయం చేయలేకపోయారంటూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లపై రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు.రెబల్‌స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం ద్వారా పార్టీకి తీరని నష్టం చేశారని సీఎం అన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని ఆదేశించారు. తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 12,733 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 7,000కు పైగా స్థానాల్లో గెలవగా, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 3,502కు పైగా స్థానాల్లో, బీజేపీ 688 స్థానాల్లో విజయం సాధించారు. తమకు పట్టున్న కొన్ని స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈ క్రమంలో బాధ్యులపై అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ పంచాయతీ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు తిరుగులేని బలాన్ని ఇస్తే, మరోవైపు అంతర్గత ప్రక్షాళనకు అవసరమైన సంకేతాలను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ విజయాన్ని కేవలం అంకెల్లోనే చూడటం లేదు. క్షేత్రస్థాయిలో నాయకత్వ జవాబుదారీతనాన్ని కోరుకుంటోంది. ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకపోతే భవిష్యత్‌లో పార్టీ నుంచి కఠిన చర్యలు తప్పవు అన్న సందేశం సమావేశం ద్వారా స్పష్టమైంది.

## ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తోంది

ఎన్డీయే ప్రభుత్వం పగలు, రాత్రి కృషి చేస్తోంది. నమ్రప్‌లోని ఈ యూనిట్ వేలాది కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్లాంట్ పని ప్రారంభించిన తర్వాత, చాలా మందికి ఇక్కడ శాశ్వత ఉద్యోగాలు లభిస్తాయి. ఇంకా, ఈ ప్లాంట్‌తో సంబంధం ఉన్న అన్ని పనులు స్థానిక నివాసితులకు, ముఖ్యంగా యువతకు ఉపాధిని కల్పిస్తాయి. నేడు, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ సృష్టించిన సమస్యలను పరిష్కరిస్తోంది. అస్సాం మాదిరిగానే, దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లోని అనేక ఎరువుల కర్మాగారాలు కూడా మూతపడ్డాయి. వాటిన్నింటి పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గతంలో రైతులు యూరియా కోసం లైన్లలో వేచి ఉండాల్సి వచ్చేది. పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేసేవారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. కాంగ్రెస్ మరింత దిగజారించిన పరిస్థితులను మెరుగుపరచడానికి మన ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని ఆయన అన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వం విత్తనం నుండి మార్కెట్ వరకు రైతులకు అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రైతులు రుణాల కోసం ఇబ్బంది పడకుండా వ్యవసాయ పనులకు సంబంధించిన డబ్బును నేరుగా రైతుల ఖాతాలకు బదిలీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇప్పటివరకు దాదాపు రూ. 4 లక్షల కోట్లు రైతుల ఖాతాలకు బదిలీ అయ్యాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ జాతి వ్యతిరేక ఆలోచనలను ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. వారు బంగ్లాదేశ్ చొరబాటుదారులను అస్సాం అడవులు, భూములలో స్థిరపరచాలని కోరుకుంటున్నారు. వారు తమ ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవాలనుకుంటున్నారు. వారు మీ గురించి పట్టించుకోరు. కాంగ్రెస్ పార్టీకి మీ గుర్తింపుతో ఎటువంటి సంబంధం లేదని ప్రధాని మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అక్రమ వలసదారులను స్థిరపరిచిందని, వారిని రక్షిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అందువల్ల, కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తోందన్నారు. అసోం గుర్తింపు, గౌరవాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఉక్కు కవచంలా అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. "కాంగ్రెస్ బుజ్జగింపు, ఓటు బ్యాంకు అనే ఈ విషం నుండి మనం అస్సాంను రక్షించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## అమెరికాలో ఎన్ని రోజులు ఉండొచ్చు

బుర్కినా ఫాసో, మాలి, నైజర్, దక్షిణ సూడాన్, సిరియా దేశాల పౌరులపై అమెరికా ప్రయాణ నిషేధాన్ని విధించింది. పాలస్తీనా జారీ చేసిన ప్రయాణ పత్రాలు ఉన్నవారికి కూడా ఇది వర్తిస్తుంది. నైజీరియా, సెనెగల్, టాంజానియా, జాంబియా వంటి మరో 15 దేశాలపై పాక్షిక పరిమితులు విధించారు. మోసపూరిత వలసలను అరికట్టేందుకు కుటుంబ ఆధారిత వలస వీసా కేటాయింపులను కూడా తగ్గిస్తున్నట్లు వైట్ హౌస్ ప్రకటించింది.
అమెరికా పౌరులు కాని ప్రతి ప్రయాణికుడికి I94 రికార్డ్ తప్పనిసరి. వాయు, సముద్ర మార్గంలో వచ్చేవారికి ఇది ఆటోమేటిక్‌గా ఎలక్ట్రానిక్ పద్ధతిలో జారీ అవుతుంది. భూమార్గం ద్వారా వచ్చేవారు సమయం ఆదా చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో ముందుగానే తాత్కాలిక I94 కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు


ప్రశ్నించాలన్నారు.ఇక రాజకీయ నేతలు,అధికారులను విచారించనుంది సిట్. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా వున్న SIB మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ కొనసాగుతోంది. శనివారం జూబ్లీ హిల్స్ పీఎస్‌లో ఆయన్ని ప్రశ్నించారు సిట్ అధికారులు. ఇప్పటి వరకు ఏసీపీ,డీసీపీ, జాయింట్ సీపీ స్థాయి ఆఫీసర్లు విచారణలో పాల్గొన్నారు. ఐతే సోమవారం సీపీ సజ్జనార్ స్వయంగా ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తారని తెలుస్తోంది.

# 108 సంఖ్య ప్రాధాన్యత ఏంటో తెలుసా ..!?

జయభేరి, హైదరాబాద్ :




కొన్ని సంఖ్యలకు విశేష ప్రాధాన్యం ఉంది. అందులో 108 ప్రధానమైనది. 9వ సంఖ్యకు కూడా ఎంతో క్రేజ్ ఉంది. అసలు వీటికి ఎందుకింత ప్రాముఖ్యత ఉంది... మానవ జీవితానికి వీటికి ముడిపడ్డ అంశాలు ఏమిటనేవి చాలా ఆసక్తికరమైన విషయాలు.
చాలామంది ఆలయాల్లో 108 సార్లు ప్రదక్షిణలు చేస్తుంటారు. అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలలోనూ 108 అనే సంఖ్యకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. ఆలయాల్లోని పూజారులు భక్తులకు 108 పూసలున్న జపమాలు ఇస్తుంటారు. ఆ పవిత్ర పూసలు గల జపమాలను 108 సార్లు గణిస్తూ దేవుడిని తలుచుకోమని చెబుతారు. దీంతో ఆనందం, శాంతి, సౌభాగ్యం ఆధ్యాత్మికత భావన కలుగుతాయంటుంటారు. అయితే వీటికి గల కారణాలు చాలా ఉన్నాయి. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం 12 రాశులు, 9 గ్రహాలుంటాయి అందువల్ల 12 x 9 = 108. 108 అనే సంఖ్య 9చే భాగించబడుతుంది. అందువల్ల 9 అనే సంఖ్యకు కూడా ఎంతో విశిష్టత ఉంది. అలాగే 9వ గుణింతంలో కొన్ని గమనించాల్సిన అంశాలున్నాయి. 9 X 7 = 63 (6 + 3 = 9), 9 X 5 = 45 (4 +5 = 9), 9 X 16 = 144 (1+ 4+ 4 = 9) ఇలా పలురకాలుగా 9 గుణింతంలో అంతా 9 సంఖ్యనే కనబడుతుంది.
ప్రతి ఒక్కరు 9నెలలు (36 వారాలు) తల్లి గర్భంలో ఉంటారు. కేవలం మనుషులు మాత్రమే ఇలా తల్లి గర్భంలో9 నెలల పాటు ఉంటారు. అలాగే మన శరీరంలో కూడా కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, తదితర వాటితో కలిపి మొత్తం #నవరంధ్రాలుంటాయి. మహాభారతంలో మొత్తం 18 అధ్యాయాలు వున్నాయి. మహాభారతంలో చివరకు జరిగే యుద్ధం 18 రోజులు. ఈ యుద్ధంలో పాల్గొన్న సైన్యాలు 18. కౌరవుల నుంచి 11కాగా పాండవుల నుంచి 7 సైన్యాలు పాల్గొన్నాయి. పాండవుల నుండి ఈ యుద్ధంలో మొత్తం 18 సైన్యాలు ఉన్నాయి. జగద్గురువు శ్రీకృష్ణ భగవానుడు మానవాళికి ఇచ్చిన మహాకానుక భగవద్గీత. ఈ పవిత్ర గ్రంథంలో మొత్తం #18 అధ్యాయాలు ఉన్నాయి. పాండవులు (36 = 9) మహాభారతం యుద్ధం ముగిశాక 36 సంవత్సరాల పాటు హస్తినాపురాన్నిపాలించారు. సంఖ్యాశాస్త్ర ప్రకారం 108 కి యజ అనే పేరు కలదు. దీనిని తిరగేస్తే జయ అనే అర్థం వస్తుంది. అందువల్లనే 18 పర్వాలు,18 అధ్యాయాలు, కల మహాభారతానికి _జయ అని మొదటగా నామకరణం చేసారు.
ఆయుర్వేదం ప్రకారం మనిషి శరీరంలో 108 మర్మస్థానాలుంటాయట. 108 అనే మర్మాల గొలుసులో 107 గ్రంధులు శరీరంలో ఉంటాయి. ఇవి శరీరంలో ప్రధాన స్థానాలు. పూర్వం యుద్ధం చేసే సమయంలో శత్రువుకు సంబంధించిన ఆ మర్మ స్థానాలపై దాడి చేసి సంహరించేవారంట. అలాగే ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి గుండె ఒక నిమిషంలో 72 (7+ 2 = 9) సార్లు ప్రవహిస్తుంది. అందువల్ల 108 సంఖ్య మనస్సును నిర్మలంగా ఉంచుతుందని ఆస్ట్రాలజీ ప్రకారం చెబుతారు. హిందూఇజంలో 18 పురాణాలు, 108 ఉపనిషత్తుల, భగవద్గీతలో 18 అధ్యాయాలు, ఎన్నో ప్రముఖ సంస్కృత గ్రంథాలలో 108 శ్లోకాలు ఉంటాయి. అలాగే విష్ణు, శివుడులకు 1008 పేర్లున్నాయి. అందువల్ల చాలామంది సిద్ధులు తమ తమ పేర్లకు ముందు 108గానీ, 1008గానీ ఉంచుకునే సాంప్రదాయం ఉంది. సంస్కృత భాషలో 54 అక్షరాలు ఉంటాయి. వీటికి శివ, శక్తి తత్వాలైన స్త్రీ, పురుష రూపాలుంటాయి. అంటే 54 X 2 = 108. భారతీయ కాలగణన ప్రకారం బ్రహ్మకు ఒక రోజు అంటే 4 యుగాలు కలిసి 43,20,000 సంవత్సరాలు. ఇది 108 అనే సంఖ్యతో భాగించబడుతుంది.
శ్రీయంత్రం మహామహిమాన్వితమైనదని శ్రీయంత్రంలో సర్వదేవతా మూర్తులూ నివాసం ఉంటాని అంటుంటారు. శ్రీయంత్రంలో ఊర్ధ్వ భాగంలో 4 భుజాల త్రికోణాన్ని ''శివచక్రం'' అంటారు. దాని కింద 5 త్రికోణ భుజాలను ''శక్తిచక్రం'' అంటారు. మధ్యలో ఉన్న బిందువును ''ఆదిశక్తి''గా భావిస్తారు. ఈ బిందువు నుండి కిందవరకూ ఉన్న భాగాన్ని ''భూస్థానం'' అంటారు. ఈ విధంగా బిందువు నుండి భూస్థానం వరకూ శ్రీయంత్రం 3 భాగాలుగా ఉంటుంది. ఇందులోని ప్రతి త్రిభుజం 180 డిగ్రీస్ లో ఉంటుంది.
వేద ఋషులు ఖగోళశాస్త్రానికి సంబంధించిన గణనలో భూమికి, చంద్రునికి మధ్య దూరం, చంద్రుని వ్యాసానికి 108 రెట్లు ఉందని.. భూమికి, సూర్యునికి మధ్య దూరం, సూర్యుని వ్యాసానికి 108 రెట్లు ఉందని.. సూర్యుని వ్యాసం భూమి వ్యాసానికి 108 రెట్లు అనీ నిర్ధారించారు. ఈ వేదగణన ఆధునిక సాంకేతిక విశ్వగణనలో లభించిన భూమికీ, చంద్రునికీ, చంద్రునికీ సూర్యునికీ ఉన్న దూరంతో దాదాపు సరిపోయింది. మనదేశంలో ఓటు వేసేందుకు, ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునేందుకు నిర్ణయించిన వయస్సు 18 (1+ 8 = 9) సంవత్సరాలు. శ్రీరామనవమి, నవదుర్గ పండుగలు జరుపుకునేది 9 రోజులు. విష్ణు మొత్తం అవతారాలు 10. ఇందులో ఇప్పటి వరకు 9 అవతారాలు పూర్తయ్యాయి. 108 సంఖ్య ప్రాముఖ్యతను భారతదేశంలో హిందువులే కాదు.. బౌద్ధులు, జైనులు, సిక్కులువంటి వారందరూ గుర్తించారు. తమలోని దైవత్వాన్ని గ్రహించటానికి ఆత్మ 108 మెట్లు దాటాలని వీరి నమ్మకం. సిక్కుల సంప్రదాయం ప్రకారం కూడా 108 పూసలుండే ఒక మాలా ఉంటుంది. చైనీయులు, బౌద్ధ తత్వవేత్తలూ 108 పూసలున్న మాలా ఉపయోగించేవారట.
చైనీస్ జ్యోతిషశాస్త్రం ప్రకారం 108 పవిత్ర నక్షత్రాలు ఉన్నాయి. కొందరు కొత్త సంవత్సరం వేడుకలను 108 సార్లు గంట కొట్టి చేసుకుంటారు. మొదటి స్పేస్ ఫ్లైట్ ఏప్రిల్ 12, 1961న యూరి _గగారిన్ అనేసోవియట్ వ్యోమగామి ద్వారా 108 నిమిషాలు అంతరిక్షంలో తిరిగింది.
సంఖ్యాశాస్త్రంలో 108ని 1+0+8=9గా రాస్తారు. ఒక సంఖ్యను 9తో గణించి వచ్చిన సంఖ్యను కూడగా తిరిగి 9 వస్తుంది. అందుకే ఇంతటి వైశిష్ట్యం గల 108 సంఖ్య ఎంతో దివ్యమైనదని చాలామంది నమ్ముతుంటారు. అది సృష్టికర్తకు, సృష్టికి అనుసంధానం కలిగించేది. అందుకే మన రుషులు, పురాణాలు, వేదాలు, భారతీయ సంస్కృతి 108కి ఇంతటి పవిత్రత ఇస్తోంది. జగత్తు, జీవుని పరికరాలు కలసి 18 అవుతాయి. బాహ్యప్రపంచం, స్థూలశరీరం అయిదు పంచభూతాల ద్వారా ఏర్పడతాయి..పది ఇంద్రియాలద్వారా బాహ్యప్రపంచాన్ని చూస్తాడు. లోపల అన్నింటిని సమగ్రంగా తెలుసుకోవడానికి మనస్సు, బుద్ధి, అహంకారం ఉన్నాయి. ఇలా 5+10+3=18 అయ్యాయి. 108లో 8 ఎప్పుడూ శరీరం తయారవడానికి ఉండే 8 తత్వాలని సూచిస్తుంది. 1 అనేది జీవుడిని తెలియజేస్తుంది. ఈ శరీరాన్ని, జీవుడిని కలిపి నియమించేది పరిపూర్ణ భగవత్తత్త్వము. అది మధ్యలోనున్న 0 ద్వారా తెలియజేయబడుతోంది. ఈ మూడింటిని తెలిపేది 108.



Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సొలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సనాతనంగా ఉన్న విజ్ఞానాన్ని కొట్టిపారేస్తుంటాం. కానీ పాతబడినంత మాత్రాన సత్యం మాసిపోదన్న విషయాన్ని మర్చిపోతుంటాం. ఆందుకు గొప్ప ఉదాహరణే మన జీవితాలలో 108 సంఖ్యకు ఉన్న ప్రాధాన్యత.


### ధార్మికప్రాధాన్యత..


గుడిలో దేవుడిని ప్రసన్నం చేసుకోవాలంటే అష్టోత్తరశతనామావళితో పూజిస్తాము. ఆ దేవుని నామస్మరణ చేసుకోవాలంటే 108 పూసలు ఉన్న మాలని వాడతాము. 108 అన్న సంఖ్య అనాదిగా మన పురాణాలలో కనిపిస్తూనే ఉంటుంది. క్షీరసాగరమథనంలో సైతం 54 మంది రాక్షసులు, 54 దేవగణాలు కలిసి చిలికిచిన సాగరంలోంచి అమృతం వెలికి వచ్చింది. మనిషిలో మంచీ, చెడు లక్షణాలు రెండూ ఉంటాయనీ... వాటిలో మంచిది పైచేయి అయినప్పుడు అమృతమయమైన మోక్షాన్ని సాధించగలుగుతామనీ ఈ ఉదంతంలోని ఉద్దేశం కావచ్చు. అలా 108 మనలోని పరిపూర్ణతకు ఒక చిహ్నంగా భావిచవచ్చునేమో! కేవలం క్షీరసాగరమథనమే కాదు వైష్ణవ దివ్యదేశాలు, శ్రీ కృష్ణుని ముఖ్య గోపికలు... ఇలా మన ధార్మిక జీవితంలో అడుగడుగునా 108 ప్రసక్తి వస్తూనే ఉంటుంది. స్థూలం నుంచి సూక్ష్మానికి మన పెద్దలు స్థూల ప్రపంచంలో ఉన్న ఈ సంఖ్యను మానవ ధార్మిక, లౌకిక జీవితానికి ఆపాదించారేమో అన్న సందేహం కలుగక మానదు. అందుకు ఉదాహరణగా మన జాతకచక్రాలనే తీసుకోవచ్చు. పిల్లవాడు పుట్టిన సమయం ఆధారంగా అతను ఫలానా నక్షత్రంలోని ఫలానా పాదం అని అంచనా వేస్తాము. అలా 27 నక్షత్రాను నాలుగేసి పాదాలతో హెచ్చిస్తే 108 పాదాలు వస్తాయి. అంటే పుట్టినవారందరూ కూడా 108 వర్గాలలో ఏదో ఒక కోవకి చెందాల్సిందే అన్నమాట. ఈ రకంగా 108ని మన జీవితానికి అడుగడుగునా అన్వయించపేచేందుకు పెద్దలు ప్రయత్నించినట్లు కనిపిస్తుంది. ఆఖరికి ఆ జీవితంలోని తత్వం అర్థం చేసుకునేందుకు రాసిన ఉపనిషత్తుల సంఖ్య కూడా 108. మన పూర్వీకులు మనిషిని ఈ విశ్వంలోని ఒక భాగంగానే గమనించారు. ప్రపంచం మనిషినీ, మనిషి ప్రపంచాన్ని ప్రభావితం చేయగలరని నమ్మారు. అందుకు అనుగుణంగానే జీవనశైలిని రూపొందించుకున్నారు. దానికి ఈ 108 సంఖ్య గొప్ప ఉదాహరణగా నిలిచిపోతుంది. ఈ విశ్వానికీ 108 అన్న సంఖ్యకూ ఎక్కడో లంకె ఉన్నదన్న విషయాన్ని మన పెద్దలు నమ్మబట్టే దానికి అనుగుణంగా ధార్మిక సూత్రాలను ఏర్పరుచుకొన్నారు. జపమాలలో 108 పూసలే ఎందుకుంటాయి? ఇది కేవలం లెక్కకోసం చేసిన ఏర్పాటేనా? లేక దీని వెనక మరేదైనా ఆంతర్యం ఉందా? అసలు 108 సంఖ్య గురించి మన శాస్త్రాలు ఏమి చెబుతున్నాయి? వంటి సందేహాలకు పెద్దలిస్తున్న వివరణ తెలుసుకుందాం.
మనిషి సగటున రోజుకు 21,600 సార్లు శ్వాసిస్తాడు. అందులో 10,800 సూర్యాంశ, 10,800 చంద్రాంశ అని తంత్ర శాస్త్రం చెబుతుంది. మనిషికి ప్రాణంకన్న ప్రియమైనది లేదు. అలాంటి ప్రియమైన ప్రాణానికి ఏకైక ఆధారం శ్వాస. మనకు శ్వాస ద్వారా ప్రాణశక్తిని ప్రసాదించిన ఆ పరమాత్మను ప్రతి శ్వాసకీ స్మరిస్తూ కృతజ్ఞత చెప్పటమే జపం.
అందుకే మన పూర్వీకులు రోజుకు 10800 నామ జపం చేసేవారట. కాలంతో బాటు వచ్చిన మార్పులను బట్టి ఈ సంఖ్య 108 కి తగ్గినదని చెబుతారు. బౌద్ధులు వాడే జపమాలలోనూ 108 పూసలు ఉంటాయి. #టిబెట్టు బౌద్ధుల 'కహగ్యూర్'లో 108 పంక్తులు ఉంటాయి. పెకింగ్ లో ప్రకాశ వంతంగా కనిపిచే #చైనీస్ వైట్ హౌజ్ లో 108 స్తంభాలు ఉన్నాయి. జపాన్లో చనిపోయిన వారి కర్మకాండలు జరిపించేప్పుడు 108 దీపాలను వెలిగిచి, 108 రూపాయలు దానంచేస్తారు. నూతన సంవత్సర సమయంలో ౧౦౮ సార్లు గంటలు కొడతారు. బర్మాలోని బుద్ధుని పాద చిహ్నంలో 108 భాగాలున్నాయి. 108ని కూడితే వచ్చేది 9. ఇది పరిపూర్ణత్వాన్ని సూచిస్తుంది. అంతేకాదు ఏ సంఖ్యనైనా 9 సార్లు హెచ్చించి, కూడినా వచ్చేది తొమ్మిదే. మన ఉపనిషత్తుల సంఖ్య కూడా 108. భరతముని రూపొందించిన నాట్యశాస్త్రంలో చేతులు, కాళ్లు కలిపి చేసే నాట్యభంగిమల మొత్తం సంఖ్య 108. సంస్కృత భాషలో అక్షరాలా సంఖ్య 54 కాగా వీటికి శివ, శక్తి తత్వాలైన స్త్రీ, పురుష రూపాలుంటాయి. అనగా 54 X 2 = 108. అన్నింటికి మించి 108ని అదృష్ట సంఖ్యగా భావిస్తారు. హిందూ ధర్మశాస్త్ర ప్రకారం 108 సార్లు ఏదైనా స్తోత్రాన్ని చదవాలని చెబుతారు. 108 సార్లు కొలిస్తే దేవుడి కరుణ ఉంటుందని అంటారు. దానికి అనుగుణంగా 108 పూసలను నిర్ధారించారని ప్రచారంలో ఉంది.

# ఓటర్లకు గాలం వేసే కార్యక్రమాలు షురూ చేసిన బడా నేతలు

- **ఒక్కసారిగా గుర్తుకొస్తున్నా గత పంచాయతీ ఎన్నికల్లో హామీలు**
- **వ్యాపారం నేపంతో రాజకీయ విలువలు కోల్పోయి ప్రవర్తిస్తున్న బడా నాయకులు**

జయభేరి, పరవాడ:






రాష్ట్రములో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహణకు సన్నాహాలు చేస్తుంటే పరవాడ గ్రామంలో అధికార బడా నాయుకులు రాబోయే ఎన్నికలకి ఇప్పటి నుంచే ప్రజలకి గాలం వేసే పనుల్లో పడ్డారు. రోజుకో వర్గాలు పేరుతో ప్రజలని విభజిస్తూ తమ ఇల్లకు పిలుపించుకొని మీకు అది చేస్తాం ఇది చేస్తాం అంటూ చెప్పుకొంటూ హామీలు మీద హామీలు గుప్పిస్తూన్నారు.వ్యతిరేక ఓటర్స్ని ఇప్పటి నుంచే తమ వైపు మలుచుకొనే పనిలో నిమగ్నం అయ్యారు. గ్రామంలో అన్నీ వాగులు వెళ్లి ఒకే చెరువులో ఎలా కలుస్తాయో రాజకీయ విలువలు కోల్పోయి వ్యాపారం పేరుతో అధికారం ఏలే జెండా రంగులు వేరు అయ్యిన బడా నాయుకులు అందరూ ఒకే గొడుగు కిందకి వస్తుడడంతో ప్రజలు ఛీ కొట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గడిచిన అధికార కాలంతా నిధులు లోటు పేరుతో అప్పటి పాలక ప్రభుత్వంపై చిందులేస్తూ కాలం గడిపి పక్క పార్టీలోకి పరుగులు తీసిన నాయుకులకి కొన్ని నెలలలో పంచాయతీ ఎన్నికలు సమిపిస్తున్న తరుణంలో ఒక్కసారిగా గ్రామ అభివృద్ధిపై శ్రద్ధ రావడం రెండు మూడు నెలల వ్యవధిలోనే ఎన్టీపీసీ,మండల నిధులు విడుదల అంటూ గ్రామంలో అభివృద్ధి పనులు ఒకదాని తరువాత ఒకటీ మొదలు పెడుతుండడంతో స్థానిక ప్రజానీకం ఆశ్చర్యం వ్యక్తం చేస్తూన్నారు. ఇది అంత వచ్చే పంచాయతీ ఎన్నికలకి ఓటర్లకి గాలం వేసే కార్యక్రమాలనే గ్రామంలో ఎన్టీపీసీ,మండల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులన్ని గత ప్రభుత్వం హయాంలో అప్పటి నాయుకుల ఆలోచనలతో ప్రతిపాదనలు చేసిన పనులకి ఇప్పుడు విడుదల అయ్యిన నిధులుతో పూర్తి అవ్వుతుండడంతో బడా నాయుకులు తమ ఖాతాలో వేసుకొనే పనిలో పడ్డారని గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రామంలో అభివృద్ధి పనులు జరగడం అవి గ్రామస్థులకి ఉపయోగపడడం వీటికి ఎవ్వరు వ్యతిరేకంకాకయినా కేవలం రెండు,మూడు నెలల కాలంలోనే గ్రామంలో ఇంత హడావడి హడావిడిగా పనులు చేపట్టడం గత నాలుగున్నర ఏళ్లుగా అవ్వని పనులు చివరి ఆరు నెలలోనే జరుతుండడంతో అభివృద్ధి పేరుతో ఇతరాత్ర హామీలుతో ప్రజలకి ఎర వేసి గాలం పట్టే పనిలో భాగమేనని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయానికి ఇది కేవలం ఆకుర్పణని ముందు ముందు జరగబోయే పరవాడ గ్రామ రాజకీయం ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలలో ఏ గ్రామాన వెతికిన కూడా కనబడదని గ్రామంలో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# డీఎం & హెచ్ ఓ గారు కాస్త ఉప్పల్ పీహెచ్ సీ పై దృష్టి సారించండి

- ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాల వద్ద డబ్బులు వసూళ్ల ఆరోపణలు
- పట్టించుకోని మెడికల్ ఆఫీసర్
- అంతా నాదే రాజ్యం అంటున్న సూపర్వైజర్

**జయభేరి, ఉప్పల్, డిసెంబర్ 21:**




ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అంటే ఒకప్పుడు జిల్లా లోని గుర్తింపు ఉన్న ఆస్పత్రి కానీ ఇప్పుడు పూర్తిగా విరుద్ధమని చెప్పాలి. మెడికల్ ఆఫీసర్ కు సూపర్ వైసర్ కు, ఆశలకు సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందనీ చెప్పవచ్చు ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోజు రోజుకు అవినీతి తాండవం చేస్తుంది. అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ సంతకం దేనిమీద కావాలన్నా డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందినీ గతంలో అనేక ఆరోపణలు. చివరకు ఆశ కార్యకర్తలు లేదా ఆరోగ్య కార్యకర్తలు కూడా ఎవరికన్నా మెడికల్ ఆఫీసర్ సంతకం కావాలన్నా డబ్బులు అడుగుతున్నారు అని తోటి సిబ్బంది అందరూ తమ గోడును చెప్పడం విడ్డూరం.. ప్రభుత్వ ఆసుపత్రిలో అందిన కాడికి దండుకోవడం ఎంటి అని వచ్చిన రోగులు తమ బాధలను అనేక సార్లు వెళ్లగక్కారు కొన్ని రోజులకు ముందు ఆశ కార్యకర్తలు తమ యొక్క వ్యక్తి గత వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవడానికి ప్రతి ఒక్కరి దగ్గరి నుండి ఆశ నోడల్ అధికారి డబ్బులు వసూలు చేయడం జరిగిందని కొందరు ఆశలు గతంలో మీడియా మిత్రులకు తెలియజేశారు. మరి ఇప్పుడు ఆశలకు చాలా సంవత్సరాలకు యూనిఫాంలు వచ్చాయి. వాటిని ఆశలకు ఇవ్వడానికి ఆశ నోడల్ ఆఫీసర్ డబ్బులు డిమాండ్ చేస్తుందని గతంలో ఆరోపణలు మెండుగా ఉన్నాయి ఎందుకు డబ్బులు ఇవ్వాలని ఆశలు అడిగితే జిల్లా కార్యాలయం నుండి తీసుకొని రావడానికి ప్రయాణ ఖర్చులు ఇవ్వాల్సిందే అని చెప్తున్నారు. అడిగిన వాళ్లను మెడికల్ ఆఫీసర్ మరియు ఆశ నోడల్ ఆఫీసర్ మిమ్మల్ని డ్యూటీ నుండి డిస్మిస్ చేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. దీనిపై ఏ ఎన్ ఎం, ఆరోగ్య కార్యకర్తలను వివరణ అడుగుగా ఆషాలు డబ్బులు ఇవ్వకపోతే మమ్మల్ని(ఏ ఎన్ ఎం ) లను ఇవ్వమని అంటున్నారు, మేము ఎందుకు ఇస్తామని అడిగితే అడిగిన వారినీ భయభ్రాంతులకు గురి చేస్తూ మీరు ఉద్యోగం చేయాలని ఉందా లేక ఇంటికి వెళ్లాలని ఉందా అని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సూపర్ వైసర్లు ముక్కు పిండి ఆశలతో డబ్బులు వసూలు చేయడం ఎందుకు ఇవ్వాలని అడగగా పై ఆఫీసర్లు ఆశలతో డబ్బులు వసూలు చేయాలని కారకండిగా చెప్పారని చెప్పడం విశేషం.. అసలు మెడికల్ ఆఫీసర్, సూపర్ వైసర్ ఒక్కటేనా లేక సూపర్ వైసరే మెడికల్ ఆఫీసర్ గా చెలామణి అవుతున్నారా అనే సందిగ్ధం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొంది ,మరి మెడికల్ ఆఫీసర్ కి సూపర్ వైసర్లకు ఇందులో వాట ఎంత ఇదంతా డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కి తెలిసి జరుగుతుందా హెల్త్ ఆఫీసర్ లేక సదరు డిస్ట్రిక్ట్ మెడికల్ గారు తెలిసి కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా ..?లోగుట్టు పై వాడికే తెలియాలి..!

సూపర్ వైసర్ల కు ఆశలు అన్నా , ఏ ఎన్ ఎం లు అన్నా కనీస గౌరవం లేకుండా మాట్లాడడం నాకు డిస్టిక్ మెడికల్ & హెల్త్ ఆఫీసర్ సపోర్ట్ ఉందని విర్రవిగడం చూస్తుంటే లోపల జరిగే రాయబారాలు ఇంకెన్నో విధుల పట్ల బాధ్యతగా ఉండాల్సిన జిల్లా అధికారి అల సత్యం వెనక ఉన్న రహస్యం ఏంటో. ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అసలు మెడికల్ ఆఫీసర్ ఉన్నారా లేక.. సూపర్ వైసర్ల ఇష్ట రాజ్యం నడుస్తుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన రోగుల ముందే ఇష్టారీతిగా అసభ్య పదజాలంతో మాట్లాడడం ఏంటో అర్థం కాని పరిస్థితి ఆసుపత్రిలో నెలకొంది. సూపర్ వైసర్లు, పై ఆఫీసర్లు వర్క్ చేయండని చెప్పాలి కానీ ఫ్యామిలీ విషయాలు మాట్లాడడం చూస్తుంటే హాస్పిటల్ లో ఎలాంటి గందరగోళ పరిస్థితులు ఉన్నాయో ఇట్టే చెప్పవచ్చు. సదరు సూపర్ వైజర్ ఆశలను కార్యకర్తలను అసభ్య పదజాలంతో దూషించడం పరిపాటిగా మారిందనీ డ్యూటీ విషయాలు వదిలేసి సొంత విషయాలకు ప్రాధాన్యత ఇస్తుందని ప్రతీ పనికి ఇష్టారీతిగా మాటలాడటం సదరు సూపర్ వైజర్ కే చెల్లిందని ఆశలు చెప్పడం, హాస్పిటల్ టైమ్ లో ట్రీట్ మెంట్ కోసం వచ్చిన రోగులను వదిలేసి ఆశలను ఏ ఎన్ ఎం లతో గొడవలకు దిగడం ఏంటని అక్కడికి వచ్చిన పేషెంట్లు సైతం చెప్పడం విడ్డూరం. పై విషయాలను అన్నింటినీ గమనించి ఉన్నతాధికారులు మెడికల్ ఆఫీసర్, సదరు సూపర్ వైజర్ పై సమగ్ర మైన విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సిబ్బందికి న్యాయం చేయాలని అందరూ రోగులు ఆస్పత్రి సిబ్బంది తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

---



## ఘనంగా వైస్సార్సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైస్ జగన్ జన్మదిన వేడుకలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల పార్టీ ఆధ్వర్యంలో వైస్సార్సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రివర్యు శ్రీవైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ యొక్క జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా పెందుర్తి సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజ్ , హాజరై రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, మండల జడ్పీటీసీ పియస్ రాజు, రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్ లతో కలిసి జన్మదిన కేక్ ను కట్ చేశారు. ఈ యొక్క జన్మదిన వేడుకలో పార్టీ సీనియర్ నాయకులు చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బంధం నాగేష్, బూస అప్పలరాజు సర్పంచ్లు బొండా కనకారావు, కూండ్రపు.సీతారామయ్య, పల్లా (కబాడీ) అప్పారావు, పెదిశెట్టి శేఖర్ ,మెంటి మహేష్, చల్లా కనకారావు, సుందరపు అప్పారావు, ఐడి బాబు, పైల అప్పలనాయుడు, దళాయి నదియా, బోడ్డపల్లి హేమంత్, గాలి చరణ్ రాజ్, ~~మాసవరపు అప్పారావు, కుండ్రపు ఉమా మహేశ్వరి, పాసిల దివ్య, ఆశా జ్యోతి,~~ దాదా నాయుడు తిక్కాడ సత్యన్నారాయణ బొబ్బిలి సత్తిబాబు,పైలా రాధాకృష్ణ, స్పీడ్ మసేను, బత్తి అప్పారావు అడ్డూరి శ్రీను సమ్మంగి హరీష్, కుండ్రపు తాతాజీ, తోట పవన్, గండి సూరిబాబు,కంచిపాటి భాస్కర్, సత్తీలు,ఎడ్ల నాయుడు,గంజి వెంకటలక్ష్మి,పైలా అప్పలనాయుడు, గరగ పైడంనాయుడు, లాలం రవీంద్ర, చుక్క కాశి, వర్రీ నరసింహమూర్తి, వర్రీ హరి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

## సమయాన్ని వృధా చేసుకోకుండా క్రమశిక్షణతో నడుచుకోవాలి

- విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం
- ఘనంగా సిఎంఆర్ పాఠశాల ద్వితీయ వార్షికోత్సవం



**జయభేరి, మేడ్చల్ :**

విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ సమయాన్ని వృధా చేసుకోకుండా లక్ష్యంతో ముందుకు సాగాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం సూచించారు. ఆదివారం మేడ్చల్ పట్టణంలోని సిఎంఆర్ పాఠశాల ద్వితీయ వార్షికోత్సవ దినోత్సవాన్ని ఆరోహన్ 2025 పేరుతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉత్సవాల్లో పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం ఆయా తరగతుల విద్యార్థులు ఆయా వేషధారణలలో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ.... తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రతిరోజు సమయం కేటాయించాలని, చిన్నప్పటి నుంచే పిల్లల్లో క్రమశిక్షణను అలవారేలా చూసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు సమాజంలో జరుగుతున్న విషయాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి, వివరించాలని సూచించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కార్యదర్శి చామకూర శ్రీశైలం సౌజన్య రెడ్డి మాట్లాడుతూ... విలువలతో కూడిన విద్యను అందించడంలో తమ ప్రధాన ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా సంచాలకులు అనురాధ, చామకూర శ్రీశైలం రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు తనుజ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

---


# కొనసాగుతున్న భక్తుల రద్దీ

- స్వామివారి నిత్యరాబడి రూ.45.47 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం వారాంతం సెలవు కావడంతో స్వామి,అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి శీఘ్ర దర్శనానికి 4 గంటలు, అతిశీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టినట్టు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు..**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా గోదాదేవికి తిరుప్పావై పారాయణం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగాఆదివారంరూ.45,47,247ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,91,200, బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,68,400, వీఐపీ దర్శనం ద్వారా రూ.6,90,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.7,11,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.85,632, ప్రసాద విక్రయం ద్వారా రూ.18,76,300, కల్యాణకట్ట ద్వారా రూ.93,000తో పాటు వివిధ శాఖ,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**స్వామి వారి సేవలో..**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీపీ శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

**ఈనెల 23న హుండీ ఆదాయం లెక్కింపు..**

ఈనెల 23వ తేదీన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు. కొండ క్రింద వ్రతమండపంలో హుండీ ఆదాయం లెక్కింపు జరుగుతుందని, లెక్కింపులో పాల్గొనే సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

---



## నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్, ఉపసర్పంచ్ లను సన్మానం చేయనున్న కేటీఆర్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ & వార్డు సభ్యులకు ముఖ్య సమాచారము. మంగళ వారం నల్లగొండ జిల్లా కేంద్రం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు బిఆర్ఎస్ పార్టీ తరపున నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ లకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చే అభినందన సన్మాన కార్యక్రమం కలదు. దేవరకొండ నియోజకవర్గంలోని నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు సకాలములో నల్లగొండలోని బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్ కు రాగలరు. రమావత్ రవీంద్ర కుమార్ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు.

---

## అలయ పార్కింగ్ దుకాణాలకు వేలం

**జయభేరి, మేడ్చల్ :**

ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనపూర్ క్షేత్రగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జనవరి 13 నుంచి 16వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా పార్కింగ్ తో పాటు పూజా సామగ్రి దుకాణాల నిర్వహణకు ఈనెల 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు.

---

## ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థిని ఓదార్చిన అభిషేక్ నాయక్

**జయభేరి, నేరెడు గొమ్ము :**

నేరేడు గోమ్ము మండలం ధర్మారేక్య తండాలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ తరపున పోటీ చేసిన చంద స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకుడు ఇస్లావత్ అభిషేక్ నాయక్ ధర్మరేక్య తండాకు వెళ్లి చందని పరామర్శించారు. ఈ సందర్భంగా అభిషేక్ నాయక్ మాట్లాడుతూ, ఓటమి గెలుపు రాజకీయాల్లో సహజమని, నిరాశ చెందకుండా ధైర్యంగా ముందుకు సాగాలని చంద కి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. అలాగే పార్టీ ఎప్పుడూ కార్యకర్తలతో,నాయకులతో అండగా ఉంటుందని, చంద చేసిన సేవలను పార్టీ గుర్తిస్తుందని తెలిపారు.

---

## సర్పంచ్ కౌవిడే మహేందర్ కు సన్మానం



**యాదగిరిగుట్ట, డిసెంబర్ 21:**

భారత మానవ హక్కుల సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల గెలిచిన సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఆదివారం యాదగిరిగుట్ట మండల పరిధిలోని బాహుపేట గ్రామ సర్పంచ్ కౌవిడే మహేందర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బబ్బూరి పోశెట్టి,మంగ నర్సింహులు మాట్లాడుతూ కొత్తగా గెలిచిన గ్రామ సర్పంచ్‌లు గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు బండ శ్రీనివాస్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

---

# హాస్టల్ గదులు బూతు బొమ్మలు

- ఎస్టీ బాలుర కళాశాల వసతి గృహాల్లో సమస్యల తిష్ట

**జయభేరి, మేడ్చల్ :**




మేడ్చల్ ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస వసతులు లేక విద్యార్థులు అరకొర వసతుల మధ్యే గృహాల్లో గడుపుతున్నారు. వసతి గృహంలో మరుగుదొడ్లలో అపరిశుభ్రత, చెత్త పేరుకుపోయి విద్యార్థులు చెత్తతో సావాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొంత మంది ఆకతాయిల వెకిలి చేష్టలతో హాస్టల్ గదులు బూతు బొమ్మలతో నిండిపోయాయి. ఆకతాయిల చేష్టలతో కష్టపడి చదువుకునే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బూతు బొమ్మల కారణంగా తమ తల్లిదండ్రులు హాస్టల్ కు కలిసేందుకు రానివ్వకుండా బయటనే కలుస్తున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. హాస్టల్ వార్డెన్ కు సమస్యలపై పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని నిరుపేదలమైన మేము వేలకు వేల ఫీజులు చెల్లించలేక ఈ వసతి గృహాల్లో మగ్గుయున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

---

## ది ఓక్స్ స్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలంలో గొర్లివానపాలెం గ్రామంలో ఉన్న ది ఓక్స్ స్కూల్ యాజమాన్యం ప్రిన్సిపల్ ఎన్ అలేఖ్య మరియు కోఆర్డినేటర్ సూర్యప్రభ బెహరా ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 79 వ వార్డు జన సేన పార్టీ అధ్యక్షుడు పిల్లా శివకృష్ణ పాల్గొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యంతో పాటు 79వ వార్డు టిడిపి నాయకులు కర్ణం అప్పారావు , జన సేన పార్టీ నాయకులు మున్నగోప్పల జనార్ధన్ రావు, నగిరెడ్డి వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు



## అభివృద్ధికి ఇస్తానన్నా నిధులు ఇవ్వు..

- లేదంటే గ్రామ సర్పంచ్ రాజీనామా చేయి
- మైలారిగూడెం గ్రామ పంచాయతీ నూతన పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు
- డబ్బులెవరికీ ఇవ్వను.. ఏకగ్రీవంమైన గ్రామ సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 21:**

యాదగిరిగుట్ట మండలంలోని మైలార్‌గూడెం గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం ఎన్నికపై రగడ మొదలైంది. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవం చేసుకొని గ్రామాభివృద్ధి కోసం శివాలయ నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధికి డబ్బులు ఇవ్వాలని మైలార్ గూడెం గ్రామస్తులు ఒప్పందం చేసుకొని మారెడ్డి కొండల్‌రెడ్డిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచ్ ప్రమాణస్వీకారం నేడు ఉండడంతో గ్రామాభివృద్ధి కోసం ఇస్తామన్న డబ్బులు ఇవ్వాలని నూతన పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు,వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఏకగ్రీవమైన సర్పంచ్ దగ్గరికి వెళ్లి ఇచ్చిన మాట ప్రకారం గ్రామాభివృద్ధికి డబ్బులు ఇవ్వాలని అడిగితే మీకు నేను బాకీ లేనని,మీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని మాట్లాడుతూ డబ్బులు ఇవ్వనని అన్నట్లు సర్పంచ్‌గా విత్‌డ్రా చేసుకున్న మరో వ్యక్తి కృష్ణ,ప్రస్తుతం ఉపసర్పంచ్‌గా ఎన్నికైన బండి అశోక్,నార్మల్ డైరెక్టర్ పుప్పాల నర్సింహ్మా, గ్రామపంచాయతీ నూతన పాలక మండలి సభ్యులు,గ్రామస్తులు ఆరోపించారు.గ్రామప్రజలను మోసం చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడకుండా బుకాయించిన కొండల్‌రెడ్డిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.గ్రామాభివృద్ధికి కట్టుబడి వెంటనే ఇచ్చిన మాటను వెంటనే నిలబెట్టుకొని సర్పంచ్‌గా కొనసాగాలని,లేని పక్షంలో సర్పంచ్‌గా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**ఒప్పుకున్నట్టే గుడి కట్టిస్తా.. డబ్బులెవరికీ ఇవ్వను.. కొండల్‌రెడ్డి..**

మైలార్ గూడెం గ్రామస్తుల సమక్షంలో గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామాభివృద్ధికి,శివాలయం కట్టేందుకు నేను కట్టుబడి ఉన్నానని ఏకగ్రీవంమైన గ్రామ సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి తెలిపారు. నూతన పాలకమండలి, గ్రామస్తుల ఆరోపణలపై ఆయనను వివరణ కోరగా సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధి కోసం డబ్బులు ఇస్తానని,ఆలయం కట్టిస్తానని చెప్పానని,ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి ఉన్నానని,ఇప్పుడే డబ్బులు ఇవ్వాలంటే నేను ఇవ్వలేనని, నేను గుడి కట్టిస్తానని ఆయన తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ లో మళ్లీ వైసీపీదే అధికారం

- యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల



**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 21:**

ఆంధ్రప్రదేశ్ 2029 సంవత్సరాలో ఎన్నికల్లో మళ్లీ వైసీపీనే అధికారం దక్కించుకుంటుందని,వైఎస్ జగన్ సీఎం అవుతారని రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి ఆరే శ్యామల తెలిపారు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని ఆరే శ్యామల దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ కింద వైసీపీ జిల్లా అధ్యక్షుడు వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలకు చీరలు,చిన్నారులకు నోట్ బుక్కులు,వృద్ధులకు బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆరే శ్యామల పాల్గొని మాట్లాడారు. 2029 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో ఏపీని పట్టిపీడిస్తున్న రాక్షసులను వైఎస్ జగన్ చీల్చిచెండాడుతాడని తెలిపారు. ప్రజలు,ఆ దేవుడు ఆశీర్వదిస్తే పరిస్థితులన్నీ తారుమారవుతాయని,వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసే రోజులు దగ్గరే ఉన్నాయని అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు జగన్‌పై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## పాటల్లో ఆణిముత్యం..

- సింగర్ ఎక్కలూరి వరలక్ష్మి
- ప్రసాద్ ల్యాబ్ లో పెద్దల ముందు గౌరవ సన్మానం




**జయభేరి, హైదరాబాద్ :**

ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ 24 క్రాఫ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెండితెర ఆణిముత్యాలు గోల్డెన్ గౌరవ సత్కార సన్మాన సభ లాంఛనంగా జరిగింది. ఈ కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్ లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ రాజేంద్ర జె ఎన్ మరియు డాక్టర్ మాదాల నాగూర్ కరుణాకర్ చాంబర్ సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు... వెండితెర పై వెలుగులు విరజిమ్మిన నటీనటులను యూట్యూబ్లో సింగర్స్ ను సన్మానించే కార్యక్రమం గతంలో ఎక్కడ జరగలేదు అన్నట్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రసాద్ ల్యాబ్లో ఘనంగా నిర్వహించారు నిర్వాహక సభ్యులు. ముఖ్యంగా యూట్యూబ్ సింగర్ గా మంచి ప్రతిభను కనబరిచిన ఎక్కలూరి వరలక్ష్మి ఫీమేల్ సింగర్ గా యూట్యూబ్లో రాణిస్తున్న సందర్భాన్ని జ్ఞాపకం చేసుకొని ఆమెకు శాలువాతో సన్మానం చేశారు కమిటీ సభ్యులు.. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ సింగర్ గా మంచి గుర్తింపును ఇవాళ పెద్దల ముందు సాధించుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అంటూ తమ సంతోషానికి హద్దులు లేవంటూ ఆనందంలో మునిగిపోయారు. ఎంతైనా కళాకారులకు భుజం తట్టి శభాష్ అంటే అంతకంటే ఆస్తి అంతస్తులు ఇంకేముంటాయి... కళాపోషకులు ఉన్నంతకాలం కళాకారులు నిత్య నూతనంగా ఉద్భవిస్తూనే ఉంటారు.

# ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

- పని హక్కు చట్టాన్ని పథకంగా మార్చిన మోడీ ప్రభుత్వం
- చట్ట పరిరక్షణకు ఊరూరా ఉద్యమాన్ని ఉధృతం చేయాలి
- బిల్లు పత్రాలను దగ్ధం చేసిన ఏఐకేఎమ్ఎస్

**జయభేరి, బయ్యారం, డిసెంబర్ 21:**




ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లును బిజెపి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు.బయ్యారం మండల కేంద్రంలో అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో వీబీ జీరాంజీ బిల్లు పత్రాలను ఆదివారం దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఏఐకేఎమ్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ, బిజేపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్‌లో బీవీ జీరామ్ జీ బిల్లు పెట్టి ఆమోదింప చేసుకొందని అన్నారు.వ్యవసాయ కార్మికులకు,పేదలకు తీవ్రంగా నష్టం చేసే ఈబిల్లునుఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాలకు చెందిన 30కోట్లమందికి పైగా పేదలకు ఉపాధిని కల్పిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ నీరుగారుస్తుందని ఆరోపించారు.పనిదినాలను పెంచామనే పేరుతో కూలీల సంఖ్యను భారీగా తగ్గిస్తున్నారనిఅన్నారు. ఇపుడున్న చట్టంలో 90శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి వుండగా, దాన్ని 60శాతానికి కోత పెడుతూ 40శాతం నిధులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని బిల్లులో పేర్కొన్నారనిఅన్నారు.దీంతో నిధుల కొరత వున్న రాష్ట్రప్రభుత్వాలు ఈ పథకాన్ని ఎత్తివేసే ప్రమాదం ఏర్పడే పరిస్థితి నెలకొంటుందని ఆవేదనవ్యక్తంచేశారు.వ్యవసాయపనులు వున్న సమయంలో ఈ బిల్లులో 60రోజుల పనిని నిషేధిస్తున్నారని అన్నారు. వ్యవసాయ సీజన్ లో ఉపాధి హామీ పనులు పూర్తిగా నిలిపివేయాలని చెప్పడం వల్ల కూలీలకు పని దొరకని స్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి చట్టం పేరుమార్చి వికసిత భారత్ '' గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి జి రాం జీ) పేరు పెట్టడం సమంజసంకాదన్నారు.గతంలో వున్న ఉపాధి హామీ చట్టం ప్రకారం 100 రోజులు తగ్గకుండా పని కల్పించాలని కోరారు.పనిదినాలు 200 రోజులకు పెంచాలన్నారు. కూలీని 307 నుండి రు.600 వరకు పెంచాలని డిమాండ్ చేశారు.గత ఉపాధి చట్టాన్ని అమలు చేయాలని, తక్షణమే ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎమ్ఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు,రాష్ట్ర నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ,సంఘం జిల్లా నాయకులు రామచంద్రపు మురళీ,పూనెం లింగయ్య,తోకల వెంకన్న,మేకపోతుల నాగేశ్వరరావు, బానోత్ నర్సింహా,పూనెం బిక్షం,పీవోడబ్ల్యూ నాయకులు ఊకె పద్మ,బొల్లం సోమక్క, ప్రజా సంఘాల నాయకులు తుడుం వీరభద్రం, నేతకాని రాకేష్,బోనగిరి మధు తదితరులు పాల్గొన్నారు.






## ఎమ్మెల్యే బండారి చేస్తున్న సేవలు అభినందనీయం

- మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు
- కేసిఆర్ చేతుల మీదుగా ఎంబీబీఎస్ చెక్కులు అందజేత

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు మొత్తం చెల్లించడం నిజంగా గొప్ప విషయం అని మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ అన్నారు. నంది నగర్ లోని ఆయన నివాసంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 15 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కేసిఆర్ మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బాసటగా నిలవడం గొప్ప విషయం అని ఎమ్మెల్యేని కెసిఆర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ సభ్యులు గుండ్ల కుమార స్వామికి ఘన సన్మానం



**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 21 :**

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేట గ్రామపంచాయతీ 10వ వార్డ్ సభ్యులు గుండ్ల కుమారస్వామికి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని బోడుప్పల్ కార్పొరేషన్ 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దానగళ్ల అనిత యాదగిరి ల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ మేరకు అనిత యాదగిరిలు మాట్లాడుతూ.. వార్డు సభ్యులు మాట్లాడుతూ.. సీనియర్ పాత్రికేయులు, అక్షర శోధన తెలుగు దినపత్రిక ఎడిటర్ కుమారస్వామి ప్రజల కోసమే నిరంతరం శ్రమిస్తారని, మీడియా వ్యవస్థలో కూడా న్యాయం ధర్మం వైపే నిలబడతారని కొనియారు. అదే విధంగా ప్రజల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను కొనియాడుతూ.. పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోపు రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి పాల్గొని మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి కుమారస్వామి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే సొసైటీ అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి అమరేందర్ మాట్లాడుతూ..తన వార్డ్ అభివృద్ధిలో కుమారస్వామి పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు రాజగోపాల్, సత్యనారాయణలు కూడా హాజరై కుమారస్వామిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. తనకు లభించిన గౌరవం ప్రజల ఆశీర్వాదమేనని, భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజల కోసం పనిచేస్తానని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమం ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమక్షంలో ఉత్సాహంగా జరిగింది.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆన్లైన్ లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలి
- డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడియో కాల్స్ చేసి పోలీసులం అంటే నమ్మవద్దు
- సైబర్ మోసం అని గుర్తిస్తే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు నమోసు చేయండి.. డిఎస్పీ తిరుపతిరావు

**జయభేరి, గార్ల, డిసెంబర్ 21:**



ఆకర్షణీయమైన ప్రకటనలు,తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలను పాల్పడుతున్నారని మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతిరావు అన్నారు.సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని శనివారం మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయం లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ,డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఏ పోలీసు అధికారి కూడా నేరుగా వీడియో కాల్స్ చేయరని,అసలు డిజిటల్ అరెస్ట్ అనేది లేదు అని గుర్తించాలని అన్నారు.

నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్లను, వెబ్‌సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్తుతూ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా లింకులు పంపి మోసపూరిత వాగ్దానాలతో ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్నారు తెలిపారు.సైబర్ నేరస్తులు పన్నిన మోసపూరిత ఆఫర్లను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని,అనుమానాస్పద కాల్స్ లేదా లింకులు ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గార్ల బయ్యారం సీఐ రవికుమార్,ఎస్ఐ సాయికుమార్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిపై సస్పెన్షన్ వేటు

**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 20:**



స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులకు వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై మూడు సంవత్సరాల పాటు సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసే ఇతర పార్టీల అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు మూడు సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు.

సస్పెండ్ చేసిన వారిలో మాదాపూర్ గ్రామానికి చెందిన కొమ్మిరి శెట్టి నరసింహులు ,పంది ఉపేందర్ ,చిన్న లక్ష్మాపూర్ కు చెందిన మేడిపల్లి ఆగభూషి, పిన్నపురెడ్డి భూపాల్ రెడ్డి, రేఖల పోచయ్య, ధర్మారం కు చెందిన మహమ్మద్ అసాద్ బేగ్, తుర్కపల్లి కి చెందిన పసుల సత్యనారాయణ లను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని క్రమశిక్షణ తప్పితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, నాయకులు అయినాల మహేందర్ రెడ్డి, పనిగట్ల సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

